


విశేషాలంకరణలో శ్రీకాళహస్తీశ్వరాలయం

శివోహం

మహాశివరాత్రికి జిల్లాలోని శివాలయాన్నీ ముస్తాబయ్యాయి. ఆలయాలకు ప్రత్యేక అలంకరణలను చేపట్టారు. వేకువజాము నుంచే వచ్చే భక్తులను దృష్టిలో పెట్టుకుని పలు ఆలయాల్లో క్యూలైన్లను ఏర్పాటు చేశారు. పలుచోట్ల భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేయనున్నారు. ఆలయాల్లో పగలంతా ప్రత్యేక అభిషేకాలు, పూజలు, సాయంత్రం హరికథా కార్యక్రమాలు ఉంటాయి. రాత్రి జాగారం చేసే భక్తుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తమ్మీద బుధవారం శివాలయాలన్నీ భక్తజనంతో సందడిగా మారనున్నాయి.





శేష, యాళి వాహనాలపై స్వామి, అమ్మవార్లు

శేష వాహనంపై పరమశివుడి విహారం

● యాళి వాహనంపై జగదాంబ చిద్విలాసం ● ఉదయం హంస, శుక వాహన సేవలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి పరమ శివుడు శేష వాహనంపై.. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ యాళి వాహనంపై ఊరేగారు. అంతకుముందు ఆలయ అలంకార మండపం, యాగశాలల్లో ప్రత్యేక పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి ప్రదక్షిణగా గురుదక్షిణామూర్తి సన్నిధినుంచి రాజగోపురం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ శేష, యాళి వాహనాలపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. స్వామిఅమ్మవార్ల ముందు మూషికవాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ స్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప పరివారం సాగింది. స్వామిఅమ్మవార్ల పరివారాన్ని దర్శించుకోవడానికి భక్తులు పెద్దసంఖ్యలో బారులు తీరారు. ఉదయం.. స్వామి అమ్మవార్లు హంస, శుక వాహనాలపై ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ఈవో బాపిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



హంస, శుక వాహనాల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శివయ్యకు పట్టువస్త్రాల సమర్పణ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మంగళవారం పట్టువస్త్రాలను సమర్పించారు. జ్ఞానప్రసూనాంబిక అతిథి గృహం వద్ద మంత్రికి స్వాగతం పలికి ఊరేగింపుగా ఆలయం లోపలకు తీసుకొచ్చారు. అలంకార మండపంలో ఉత్సవర్ల వద్ద పట్టువస్త్రాలను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈవో బాపిరెడ్డికి అందజేశారు. వాటిని స్వామి అమ్మవార్లకు ధరింపజేసి పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సీఎం చంద్రబాబునాయుడు ఆకాంక్ష అని మీడియాతో మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఇతర అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





బంగారు ఆభరణాలతో సూర్య

గోల్డ్ మ్యాన్

● 8 కిలోల ఆభరణాలతో శ్రీవారిని దర్శించుకున్న భక్తుడు

హైదరాబాదుకు చెందిన సూర్య.. ఎనిమిది కిలోల బంగారు ఆభరణాలు ధరించి తిరుమలకు వచ్చారు. మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆయన్ను చూసేందుకు పలువురు ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా సూర్య మీడియాతో మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో ఎస్‌ఎస్‌ఎస్ ప్రజాసేవా ఫౌండేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లి బతికున్నప్పుడు బంగారు ఆభరణాలు వేసుకోమని చెబుతుండేదన్నారు. ఆమె చనిపోయాక.. ఆమె కోరిక మేరకు తాను ఈ ఆభరణాలను ధరించినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని నరసింహుడి ఆభరణం తన వద్ద ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

రుయాకు సీఎస్‌ఆర్ అనుమతి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వితరణ అందించే దాతలకు పన్ను మినహాయింపు అనుమతులు లభించినట్లు సూపరింటెండెంట్ రవిప్రభు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాతలకు పన్ను మినహాయింపు ఇచ్చేందుకు సీఎస్‌ఆర్-1(కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) సర్టిఫికెట్ కోసం ఎన్నాళ్లగానో శ్రమించామని పేర్కొన్నారు. చివరకు మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేషన్ ఎఫైర్స్ నుంచి సీఎస్‌ఆర్-1 అనుమతి పొందామని తెలిపారు. ఇకపై రుయాస్పత్రికి ఆర్థిక సాయం అందించే పరిశ్రమల నిర్వాహకులకు పన్ను మినహాయింపు ఉంటుందన్నారు.

● అసెంబ్లీ వాయిస్: తిరుపతి ఎమ్మెల్యే

గవర్నర్ ప్రసంగం ప్రజలకు భరోసా

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై అసెంబ్లీలో మంగళవారం జరిగిన చర్చలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రజల్లో భరోసా కల్పించిందన్నారు. 93 కేంద్ర పథకాలను గత ప్రభుత్వం నిలిపివేయగా 74 పథకాలను ఎనిమిది నెలల్లో సీఎం చంద్రబాబు నాయుడు పునరుద్ధరించారని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక చేపట్టిన పథకాల గురించి వివరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యమిస్తూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందన్న భరోసాను గవర్నర్ ప్రసంగం ఇచ్చిందన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

● ఉదయం 10.30 గంటలు: ఇంద్రవిమానం- చప్పర సేవ
● రాత్రి 9.30 గంటలు: నంది- సింహ వాహనసేవ

భక్తులను మోసగిస్తే కఠిన చర్యలు తప్పవు

● టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరిక

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులను దర్శనాల పేరుతో మోసగిస్తే కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ పీఆర్వో అని చెప్పుకొంటూ ప్రసాద్ అనే పేరుతో.. చైర్మన్ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకుని.. తిరుమల సమాచారం అనే గ్రూప్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ భక్తులకు శ్రీవారి దర్శన టికెట్ల ఆశజూపి ఓ వ్యక్తి నగదు వసూలు చేస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఐ భక్తుడు గోపాల్‌రాజ చైర్మన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిని బీఆర్ నాయుడు తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని టీటీడీ విజిలెన్స్ వింగ్ అధికారులను ఆదేశించారు.వింగ్ సిబ్బంది బాధితుడి నుంచి చేపట్టిన వివరాల ఆధారంగా నిందితుడు హైదరాబాదులోని ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జావేద్ ఖాన్‌గా గుర్తించారు. విజిలెన్స్ ఫిర్యాదుతో తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈక్రమంలో నిందితుడు వాట్సాప్ గ్రూప్ ద్వారా ఎన్‌ఆర్‌ఐ భక్తుల నుంచి దర్శనం పేరుతో భారీ మొత్తంలో వసూలు చేస్తూ వారి నుంచి డబ్బు అందాక.. గ్రూప్ నుంచి రిమూవ్ చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈక్రమంలో శ్రీవారి భక్తులను మోసం చేసే ఏ ఒక్కరిని ఉపేక్షించమని, దళారులు, మోసగాళ్లపై కఠిన చర్యలు తప్పవని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు హెచ్చరించారు. నకిలీ వెబ్‌సైట్లను, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మవద్దని, టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే దర్శనం, వసతి బుక్ చేసుకోవాలని కోరారు.



మృతి చెందిన జింకను తొలగిస్తున్న సిబ్బంది

వాహనం ఢీకొని జింక మృతి

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ జింక మృతి చెందింది. ఏడో మైలు మార్గ మధ్యలో ఏనుగుల ఆర్చ్ వద్ద వేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. వాహన చోదకులు గుర్తించి ఫారెస్ట్ విభాగానికి సమాచారమిచ్చారు. వెంటనే ఫారెస్ట్ అధికారులు చేరుకుని మృతి చెందిన జింకను తరలించారు.

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ జిల్లాలో బుధవారం మహాశివరాత్రి సందర్భంగా కార్యాలయాలకు సెలవైనా తమ రెవిన్యూ కార్యాలయాల్లో వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించవచ్చని ఎస్‌ఈ వి.సురేంద్రనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని రెవిన్యూ కార్యాలయాలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు.

మహిళా సంఘాలకు రుణాల పంపిణీ



భాకరాపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు జీవనోపాధులు పెంచుకోవాలని యూనియన్ బ్యాంకు మేనేజర్ నేమత్ కుమార్ సూచించారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు స్త్రీశక్తి భవన్‌లో 8 మహిళా సంఘాలకు రూ.1.5 కోట్ల రుణాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నేమత్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తాము తీసుకునే రుణాలతో శాశ్వత ప్రాతిపదికన కుటుంబాల అభివృద్ధికి తోడ్పడేలా వినియోగించుకోవాలన్నారు. డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో వానుమతి, అసిస్టెంట్ సాయి, స్వర్ణలత, సీసీ శివశంకర్ రెడ్డి, పాల్గొన్నారు.

పిల్లల స్థాయికి అనుగుణంగా విద్యాబోధన



అభ్యసనా సామగ్రిని ప్రదర్శిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

భాకరాపేట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆహ్లాదకర వాతావరణంలో విద్య బోధించాలని ఎంఈవో సత్యనారాయణ అన్నారు. చిన్నగొట్టిగల్లు ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా జరుగుతున్న శిక్షణ మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లల స్థాయికి అనుకూలమైన బోధన ఉండాలన్నారు. ఇందుకు అనుగుణంగా అభ్యసన సామగ్రి తయారు చేయాలన్నారు. సమర్థవంతమైన బోధనకు టీఎల్ఎం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గోపీనాథ్, ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ సుహాసిని, డీఆర్పీలు శిరీష, భారతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివశంకరయ్య

పాకాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలు పిల్లలకు బోధించాలన్నారు. చిన్నారులను సొంత బిడ్డలుగా ఆదరించి అక్షరాలు నేర్పించాలన్నారు. ఎంఈవో బాబ్జీ, ప్రధానోపాధ్యాయుడు జయచంద్ర, రిసోర్స్ పర్సన్స్ రమేష్, శివప్రసాద్, అన్సర్ బాషా, అంగన్వాడీ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, కిరణ్మయి, సీఆర్పీ శ్రీనివాసులు, శ్రీధర్ పాల్గొన్నారు.

తోపులాటపై వదంతులను విశ్వసించవద్దు : భానుప్రకాష్

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): తోపులాట కారణంగా తిరుమలలో బాలుడు మరణించాడనే అసత్య ప్రచారాన్ని విశ్వసించవద్దని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో భక్తులను కోరారు. తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తిరుమలలో ఏ చిన్న సంఘటన జరిగిన విశ్వవ్యాప్తంగా భక్తులను కలిచివేస్తుందన్నారు. ఉద్దేశపూర్వకంగా పవిత్రతను దెబ్బతీసేలా వ్యవహరించకూడదన్నారు. వాస్తవానికి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన బాలుడు ఆరేళ్ల క్రితమే గుండెకు సంబంధించి చికిత్స చేసుకున్నాడని ఆయన పేర్కొన్నారు.

గజలక్ష్మీ నమోస్తుతే..



తిరుచానూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు మంగళవారం గజవాహనంపై ఆలయమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. జన్మనక్షత్రం ఉత్తరాషాడ పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు అభిషేకం చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తికి సుగంధపరిమళ ద్రవ్యాలతో తిరుమంజనం నిర్వహించారు. రాత్రి గజవాహన సేవ వేడుకగా జరిగింది. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

సమ్మె విరమించండి: వెటర్నరీ విద్యార్థులకు వీసీ విజ్ఞప్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ రమణ, ఏడీ జగపతిరామయ్య తదితరులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని వెటర్నరీ వర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారమూ కొనసాగింది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ,రిజిస్ట్రార్ సీహెచ్ శ్రీలత, ఏడీ పి.జగపతిరామయ్య, వీసీ టెక్నికల్ ఆఫీసర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణలే శిబిరం వద్దకు వచ్చారు. వీసీ విద్యార్థులతో మాట్లాడారు. తరగతులకు హాజరుకావాలని కోరారు. అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య మాట్లాడుతూ..స్టైఫండ్ పెంపుపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందన్నారు. అప్పటివరకు విలువైన సమయాన్ని వృద్ధాచేయకుండా సమ్మె విరమించాలని సూచించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమవంతు కృషి చేస్తామని వీసీ వివరించారు. విద్యార్థులు ఆందోళన కొనసాగించారు.

వేడుకగా లక్ష కుంకుమార్చన



చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలో ఉగ్రప్రత్యంగిరాలయంలో మంగళవారం లక్ష కుంకుమార్చన వేడుకగా జరిగింది. వార్షికోత్సవాల సందర్భంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. 8 గంటల నుంచి ప్రత్యంగిరా మూలమంత్ర హోమం, శరబేశ్వర హోమం, లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాల పూజ చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సూరిస్వామి, వేదపండితులు సీతారామశర్మ, కార్యనిర్వాహకులు శివశంకర ప్రసాద్, రామమూర్తినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన వైజ్ఞానిక ప్రదర్శన మేళా

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణి స్కూల్లో మంగళవారం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన మేళా ఆకట్టుకుంది. జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీఈవో బాలాజీతో పాటు ఎంఈవోలు లలితకుమారి, భాస్కర్‌బాబు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అయ్యప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థల సమస్యకు పరిష్కారం



స్థలాన్ని చూపిస్తున్న అధికారులు

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అగరాల పంచాయతీలో హరిజనవాడకు ఎట్టకేలకు శ్మశాన వాటిక స్థల సమస్య తీరింది. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని టీడీపీ నాయకుడు అగరాల జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు కోరారు. ఈ విషయంలోఎమ్మెల్యే పులివర్తి నాని చొరవ తీసుకున్నారు. ఆయన సూచన మేరకు తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్వేయర్ సురేష్, వీఆర్వో విజయ్‌లు, రెవెన్యూ అధికారులు మంగళవారం గ్రామంలో 30 సెంట్ల భూమిని స్మశానవాటికకు కేటాయించారు. సర్వే చేసి, హద్దులు చూపించారు. రోడ్డు వసతి కల్పించేందుకు సర్వే చేశారు. ఎమ్మెల్యే నానికి, రెవెన్యూ అధికారులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పీ4 సర్వేను వేగవంతం చేయాలి: జేసీ శుభం బన్సల్



శుభం బన్సల్

తిరుపతి (కలెక్టరేట్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సున్నా పేదరికం లక్ష్యంగా తీసుకువచ్చిన పీ4 సర్వేను వేగవంతం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై మంగళవారం జేసీ శుభం బన్సల్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో 0-6 సంవత్సరాలలోపు పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను సంబంధిత మండలాల్లో వేగవంతం చేయాలని తెలిపారు. దీనిపై సీడీపీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారాల్లో పరమశివుడి దర్శనం



కల్పతరువు వాహనంపై అభయం

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం ఉదయం కల్పతరువు వాహనంపై, రాత్రి నందీ వాహనంపై శివపార్వతులు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, ఆనందవల్లీదేవికి అభిషేకం నిర్వహించారు. తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. 7.30 గంటలకు పార్వతీపరమేశ్వర్ల ఉత్సవర్లను విశేషంగా అలంకరించారు. కల్పతరువు వాహనంపై అధిష్ఠించి ఆలయ ప్రదక్షిణగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 గంటలకు దక్షిణామూర్తికి అభిషేకం నిర్వహించారు. 10 గంటలకు అన్నాభిషేకం చేశారు. రాత్రి 7 గంటలకు ఉత్సవర్లను నందీ వాహనంపై అధిష్ఠించి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



నందివాహనంపై పార్వతీపరమేశ్వర్లు

తిరుచానూరు: యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం ప్రదోషపూజ, అభిషేకం నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం విశేషాభిషేకాలు జరుగుతాయి. రాత్రి 10గంటల నుంచి నాలుగు పర్యాయాలు రుద్రాభిషేకం జరుగుతుంది. భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టువస్త్రాలు సమర్పించారు. టీడీపీ నాయకులు అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, సాయిరాయల్, హరిరామ్‌రెడ్డి పాల్గొన్నారు. యోగిమల్లవరంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్న ధర్మకర్త దినేష్‌కుమార్ తెలిపారు. **తిరుపతి రూరల్:** సి.గొల్లపల్లెలోని శివకోటి శివాలయంలో ప్రసన్నపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామిని ఎమ్మెల్యే నానీ దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించిన ఎమ్మెల్యే వసంతోత్సవ సేవలో పాల్గొన్నారు. ఆయన్ను టీడీపీనేతలు చొక్కారెడ్డిగారి మనోహర్‌రెడ్డి, చెంగారెడ్డి,సత్కరించారు. రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు ఎ.ఈశ్వర్‌రెడ్డి, మధు, శ్రీధర్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పరాశరేశ్వరుడికి సారె తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే పులివర్తినాని

ప్రత్యేక అలంకారంలో వల్మీకేశ్వరస్వామి



తిరుపతి రూరల్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా దుర్గసముద్రంలోని శర్వాణీదేవి సమేత వల్మీకేశ్వరస్వామి మంగళవారం ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నందిపూజతో శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. బుధవారం ఉదయం అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అన్నమాచార్య కీర్తనలు నిర్వహిస్తున్నట్లు ఆలయర్మకర్త శంకరానందరెడ్డి తెలిపారు.

రేపటి నుంచి తెలుగు భాషా సమావేశాలు

● రెండు రోజుల పాటు ఎస్వీయూలో చిత్ర కళా ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో గురు, శుక్రవారాల్లో అంతర్జాతీయ తెలుగు భాషా మూడో సమావేశాలు నిర్వహించనున్నారు. తెలుగు అధ్యయన శాఖ - ప్రాచ్య పరిశోధన సంస్థ - తెలుగు సంపద, బెంగళూరు సంయుక్తంగా దీనిని చేపట్టనున్నాయి. 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభ సభ నిర్వహిస్తారు. ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియం, ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్, సెనేట్ హాల్లో సమాంతర సదస్సులు ఉంటాయి. ఇందులో సుమారు 150 మంది ప్రతినిధులు పలు అంశాలపై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారు. ఇక, అన్నమయ్య భవనంలో తిరుపతి ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు చిత్ర కళా ప్రదర్శన నిర్వహిస్తారు. ఈ సదస్సుకు సంచాలకులుగా ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శిగా ఆచార్య వీసీ వేంకటేశ్వర్లు, సలహాదారుగా డాక్టర్ రేమిళ్ల మూర్తి వ్యవహరిస్తారు.

మృతుడి కళ్లు దానం



ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న మృతుడి భార్య గ్రేస్ మేరీ

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన వ్యక్తి కళ్లను కుటుంబ సభ్యులు ఆ ఆస్పత్రిలోని ఐ బ్యాంకుకు మంగళవారం దానం చేసినట్లు సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. కడప జిల్లా మిట్టమనిపల్లికి చెందిన చిన్న ఓబులపతి అనారోగ్యంతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో రుయా అధికారులు మృతుడి కుటుంబ సభ్యులకు కళ్లదానంపై అవగాహన కల్పించారు. దీంతో మృతుడి కళ్లను దానం చేసేందుకు ఆయన భార్య గ్రేస్ మేరీ ముందుకు వచ్చారు. మృతుడి కళ్లను దానం చేస్తున్నట్లు ఆమె ధ్రువీకరణ పత్రాన్ని ఏఆర్ఎంవో హరికృష్ణకు అందించారు. ఈ మేరకు టెక్నీషియన్ రమేష్ మృతుడి కళ్లను సేకరించి ఐ బ్యాంకులో భద్రపరిచారు.

ఘనంగా ఫార్మసీ కాలేజీ డే



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ అప్పారావు, భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఫార్మసీ కాలేజీ డేని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య రక్షణలో ఫార్మసీకి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ఇందువల్ల ఫార్మసీ విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. కాలేజీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్వోబీ కోసం అటవీ భూమి కేటాయింపు

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 1.27 ఎకరాల అటవీ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏర్పేడుకు సమీపాన ఎన్‌హెచ్-567 పై ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణంలో వున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా 510-8 కిలోమీటరు వద్ద ఆర్వోబీ నిర్మించేందుకు 1.27 ఎకరాల అటవీ భూమి అవసరమన్న జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. దీనిపై అటవీ శాఖ తిరుపతి రేంజి, కృష్ణాపురం సెక్షన్, ఏర్పేడు బీట్, కంపార్ట్‌మెంట్ నంబరు 192 పరిధిలోని రిజర్వు ఫారెస్టులో 1.27 ఎకరాల భూమిని ఆర్వోబీ కోసం కేటాయించేందుకు అంగీకరించింది. ఆ మేరకు భూమిని తిరుపతి ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈ పేరిట బదలాయిస్తూ రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అటవీ భూమిలో ఆర్వోబీ మినహా ఇతర నిర్మాణం చేపట్టరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రుయాస్పత్రికి వీల్‌చైర్ల వితరణ



తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో రోగులకు ఉపయోగకరమైన 5వీల్‌చైర్లను దాతలు మంగళవారం రుయా అధికారులకు అందించారు. రుయాస్పత్రిలో రోగులకు అవసరమైన వీల్‌చైర్ల కొరత ఉందనే విషయాన్ని హెచ్‌డీఎస్ సభ్యుడు కరణం సందీప్ తనకు తెలిసిన అమెరికా రమేష్, ఎస్.కే.శివ, జి.మధుసూదన్‌ల దృష్టికి తీసుకువెళ్లి రోగులకు సహకరించేందుకు ముందుకు రావాలని కోరారు. దీంతో వారు రూ.37,500 విలువచేసే 5 వీల్‌చైర్లను అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ వీల్‌చైర్లను కరణం సందీప్ మంగళవారం సూపరింటెండెంట్ రవిప్రభుకు అందజేశారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం అభినందనీయమని, ఇదే తరహాలో దాతలు రుయాస్పత్రిలోని రోగులకు మరింత అండగా నిలవాలని కోరారు. కరణం సందీప్‌ను, దాతలను ఆయన అభినందించారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ, హెచ్‌డీఎస్ సభ్యుడు ఖాజా మొహిద్దీన్, ఫార్మసీ అధికారులు కొండారెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులతో ఎస్ గ్రీప్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎస్ గ్రీప్ తెలిపారు. కరకంబాడి రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్(కేవీఐసీ), సూక్ష్మ, లఘు, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ(ఎంఎస్ఎంఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈసీఈ విభాగ సహకారంతో గ్రామీణ ఉపాధి కల్పన-స్వయం సమృద్ధి లక్ష్యాలపై యువత, విద్యార్థులకు నిర్వహించిన రెండ్రోజుల అవగాహనా సదస్సు మంగళవారంతో ముగిసింది. దీనిలో భాగంగా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఉపాధికల్పన పథకాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మేక్ ఇన్ ఇండియా, పరిశ్రమలస్థాపన, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎదుర్కొనే సవాళ్ల వంటి అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన, డిబెట్ పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బెంగళూరుకు చెందిన మదన్‌కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి శోభన్‌బాబు, విశ్వనాథరెడ్డి, వెంకటరామ్, కోటిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, ఈసీఈ హెడ్ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

14న అమరావతిలో శ్రీనివాస కల్యాణం

గడువులోపు ఏర్పాట్లు పూర్తిచేయండి ● అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతిలో మార్చి 14వ తేదీన శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తామని టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో కలిసి మంగళవారం సమీక్షించారు. అమరావతికి సమీపంలోని వెంకటపాలెంలో ఉన్న టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీనివాస కల్యాణాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ప్రతిష్టాత్మకంగా శ్రీనివాస కల్యాణాన్ని చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు గడువులోపు పూర్తిచేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రెండువారాల గడువు ఉండటంతో టీటీడీ అధికారులు క్షేత్రస్థాయిలో శాఖలవారీగా పనులు పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు హాజరుకానున్న నేపథ్యంలో అవసరమైన భద్రత, భక్తులకు క్యూలైన్లు, కల్యాణం రోజున భక్తులు వీక్షించేందుకు వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అమరావతి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేసేందుకు వీలుగా సంబంధిత జిల్లా అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కళాబృందాలు, ఆకట్టుకునేలా విద్యుత్, పుష్పాలంకరణలు, అన్నప్రసాదాలు పంపిణీ ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సీఈ సత్యనారాయణ, పలువురు డిప్యూటీఈవోలు, అధికారులు పాల్గొన్నారు.

మిలటరీ కాలనీలో దొంగలు పడ్డారు

తాళాలు పగులకొట్టి రూ.70,000, అరకిలో వెండి, 12 గ్రాముల నగల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి మిలటరీ కాలనీలో సోమవారం అర్ధరాత్రి పైన దొంగలు పడ్డారు. రిటైర్డు మిలటరీ ఉద్యోగి జగదీశ్వర నాయుడు ఇంటి తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. గాంధీపురం పంచాయతీ పరిధిలోని మిలటరీ కాలనీలో నివాసం ఉంటున్న రిటైర్డు మిలటరీ ఉద్యోగి జగదీశ్వర నాయుడు ఇంటికి తాళంవేసి కుటుంబ సమేతంగా చిత్తూరు వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో రెండు రోజులుగా ఆ ప్రాంతంలో నిందితులు రెక్కీ నిర్వహించారు. ఆ ఇంటి తాళాలు పగులకొట్టి గదులు, వంట గదిని తనిఖీ చేశారు. ఇంట్లోని దాదాపు 12 గ్రాముల బంగారు నగలు, రూ.70వేల నగదు, అరకేజీకి పైగా వెండి వస్తువులు అపహరించుకుని వెళ్ళారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చిన జగదీశ్వర నాయుడు కుటుంబీకులకు.. ఇంటి తాళాలు పగులకొట్టి ఉండటంతో ఆందోళన చెందారు. ఇంట్లోని బీరువాలు పగులకొట్టి దుస్తులు చిందర వందరగా పడేసి ఉండటంతో జగదీశ్వర నాయుడు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందును కలిసి ఫిర్యాదు చేశారు.

దొంగల కోసం గాలింపు చర్యలు

జగదీశ్వర నాయుడు ఇంటిలో చోరీకి పాల్పడిన దొంగల కోసం డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ చిన్నగోవిందు, ఎస్ఐలు, సిబ్బంది మంగళవారం ఉదయం నుంచి మిలటరీ కాలనీలో వున్న సీసీ కెమెరాలు, వారు వెళ్ళిన రోడ్డు నుంచి బైపాస్ వరకు తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్ ద్వారా చోరీ జరిగిన ప్రాంతం నుంచి దాదాపు కిలోమీటరు దూరం వరకు వెళ్ళి అన్ని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. చోరీ జరిగిన తీరును బట్టి బయట ప్రాంతాలకు చెందిన దొంగల ముఠా పనిగా భావిసుతన్నారు. ఇంట్లో వేలి ముద్రలు సేకరించారు. చోరీపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారథాన్‌లో ముందంజ



మారథన్‌లో రామకృష్ణ

చంద్రగిరి, ఫిబ్రవరి 25 (ఆంధ్ర జ్యోతి): కల్యాణి డ్యామ్ పోలీస్ ట్రైనింగ్ కళాశాలకు చెందిన సీఐ రామకృష్ణ ఇటీవల ఢిల్లీలో జరిగిన మారథాన్ పోటీల్లో 3:26:36 గంటల్లో 42.2 కిలోమీటర్ల దూరం పరుగెత్తారు. గతంలో ముంబై మారథాన్‌లో పాల్గొన్న సమయం కన్నా ఐదు నిమిషాలు మెరుగుపరుచుకున్నారు. అమెరికాలో బోస్టన్ మారథాన్‌లో పాల్గొనాలంటే 3 గంటల్లో 42 కిలోమీటర్ల దూరం పరుగు తీయాల్సి ఉంటుంది. ఆ లక్ష్యంతో సాధన చేస్తున్నట్లు రామకృష్ణ చెప్పారు.

పాఠశాల వార్షికోత్సవం

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతోనే కూడిన విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఎంఈవో బాలసుబ్రమణ్యం విద్యార్థులకు హితబోధ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం కేజీబీవీ పాఠశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ పరమేశ్వర స్వామి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ పరిమల మాట్లాడుతూ మహిళలు నేడు అన్ని రంగాల్లో పురోగతి సాధిస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ దేవి, పాఠశాల కమిటీ చైర్మన్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ప్రాంతీయ భూసేకరణ అథారిటీ పీవోగా సత్యారావు

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ భూసేకరణ (రిహాబిలిటేషన్ అండ్ రీ సెటిల్‌మెంట్) అథారిటీ ప్రిసైడింగ్ అధికారిగా యు.సత్యారావు నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖపట్టణం ప్రాంతీయ అథారిటీకి పీవోగా వ్యవహరిస్తున్న ఆయనను తిరుపతి ప్రాంతీయ అథారిటీ పీవోగా పూర్తి అదనపు బాధ్యతలతో ప్రభుత్వం నియమించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే దాకా ఈ నియామకం కొనసాగుతుంది. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్.పి.సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పల్లె పండుగ పనులు గడువులోగా పూర్తి చేయండి

తిరుపతి, మంగళం, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో వేగం పెంచి గడువులోగా పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా నీటి పారుదల సంస్థ ప్రధాన కార్యాలయంలో ఈజీఎస్ రాష్ట్ర సంచాలకులు షణ్ముఖ శర్మ, పంచాయతీ రాజ్ ఎస్ఈ రామ్మోహన్, డీఈలు, ఏఈలు, డ్వామా ఏపీడీలు, ఏపీవోలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన ఫామ్‌పైండ్స్, సీసీ రోడ్లు, సోక్ పిట్స్, పశువుల షెడ్ల నిర్మాణం, ఏమేరకు పూర్తయ్యాయి, ఎప్పటిలోగా పూర్తి చేయగలమనే విషయాలపై చర్చించారు.

శిక్షణ డ్రైవర్‌ను దుర్భాషలాడిన ఉద్యోగి

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సు శిక్షణలోని యువడ్రైవర్‌ను ఆర్టీసీ రెగ్యులర్ ఉద్యోగి దుర్భాషలాడిన అలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. అలిపిరి డిపో పరిధిలో అద్దె బస్సుల కింద వంద ఎలక్ట్రిక్ ఏసీ బస్సులు నడుస్తున్నాయి. వీటికి డ్రైవర్లను కాంట్రాక్టర్లే నియమించుకోవాలి. వీరు కొత్తగా 20మంది డ్రైవర్లను తీసుకొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.నారాయణను నియమించారు. ఈ క్రమంలో రెండు రోజుల కిందట తిరుమల ఘాట్‌లో శిక్షణ ఇస్తుండగా తప్పు జరిగిందని గుర్తించి నారాయణ.. శిక్షణలో ఉన్న డ్రైవర్‌ను దుర్భాషలాడారు. దీనిని కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆ వీడియో బయటకు రావడంతో సెల్‌ఫోన్లలో హల్‌చల్ చేస్తోంది. దీనిపై అలిపిరి డిపో మేనేజర్ హరిబాబును వివరణ కోరగా.. అతడిని ఆ విధుల నుంచి తప్పిస్తామని, పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మర్యాదపూర్వకంగా మెలగాలని ప్రతి ఉద్యోగికి కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

తిరుపతి అభివృద్ధికి నిధులు ఇవ్వండి

● సీఎంను కోరిన ఎమ్మెల్యే



అభివృద్ధి పనులపై చంద్రబాబుకు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. మంగళవారం మధ్యాహ్నం అసెంబ్లీలో సీఎంను ఎమ్మెల్యే కలిసి నియోజకవర్గంలోని పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుమల బాలాజీ నగర్‌లో పెండింగ్‌లో ఉన్న ఇళ్ల శ్లాబ్ నిర్మాణానికి టీటీడీ నిధులు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. మెగాస్టార్ చిరంజీవి ఎమ్మెల్యేగా తిరుమల స్థానికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆయన సీఎంకు వివరించారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులతో పాటు గాలిగోపురం మఠం పరిధిలోని కోదండరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులకు టీటీడీ చేయూత అందించేలా చేయాలని సీఎంను కోరారు. తిరుపతిలో బలిజ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో పాటు బీసీ భవన్ పూర్తి, బ్రాహ్మణ భవన్‌కు స్థలం కేటాయించేలా అధికారులకు సూచించాలని ఆయన కోరారు. తిరుపతిలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం మరిన్ని 11కేవి సబ్ స్టేషన్ల నిర్మాణానికి అనుమతించాలని కోరారు. తాను లేవనెత్తిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు.

సంజయ్‌కు ఎమ్మెల్యే పులివర్తి పరామర్శ



సంజయ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో సిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు, టీడీపీ నేత బీఎల్ సంజయ్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంగళవారం డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలసి పరామర్శించారు. సంజయ్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకులు పి.హరినాథరెడ్డి

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): దేశంలో లక్షల మంది ఆటోలు నడుపుకొని జీవిస్తున్నారని, వారి సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతి బైరాగిపట్టెడలో మంగళవారం జరిగిన ఆటో వర్కర్స్ యూనియన్ 13వ నగర మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రవాణా రంగం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వేల కోట్లు రాబడి వస్తున్నా ఆటో కార్మికులకు మాత్రం సంక్షేమానికి నోచుకోలేక పోతున్నారని ఆయన వాపోయారు. ఆటో డ్రైవర్లకు ఉచిత ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ నాయకులు కె.రాధాక్రిష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుచేయలేదని మండిపడ్డారు. హామీలు అమలు చేయని పక్షంలో మార్చి 4న రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ప్రకటించారు. అంతకుముందు బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు నుంచి ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు సి.పెంచలయ్య, ఎన్‌డి రవి, కేవై రాజా, ఎస్.పురుషోత్తంరెడ్డి, ఎన్.శివ, సురేష్, భూపాల్, సతీష్, వాణి, ప్రమీలా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వ్యవసాయ వర్సిటీ ఉద్యోగుల క్రీడా సాంస్కృతిక పోటీలు

● క్రీడల్లో కృష్ణా, సాంస్కృతిక పోటీల్లో తిరుపతి జోన్లకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న డీన్ కరుణాసాగర్

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా తిరుపతిలో నిర్వహించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉద్యోగుల క్రీడా సాంస్కృతిక పోటీలు ముగిశాయి. వివిధ క్రీడా, సాంస్కృతిక పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆ వర్సిటీ డీన్ కరుణాసాగర్ బహుమతులను అందజేసి అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలు ఉద్యోగుల్లో ఎంతో ఉత్సాహాన్నీ, ఆనందాన్నీ కలుగజేశాయని అన్నారు. ఉద్యోగ బాధ్యతలను మరింత మెరుగ్గా నిర్వహించడానికి ఈ పోటీలు తోడ్పడతాయన్నారు. క్రీడా పోటీల్లో కృష్ణా జోన్ ఉద్యోగులు, సాంస్కృతిక పోటీల్లో తిరుపతి జోన్ ఉద్యోగులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, ఫిజికల్ డైరెక్టర్ రవికాంత్‌రెడ్డి, ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి, స్టూడెంట్ అఫైర్స్ అధికారి చలం, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోగుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడితే ఇంటికే

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడినా, ఇబ్బందులకు గురిచేసినా ఇంటిదోవ తప్పదనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని రుయాస్పత్రిలోని ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వోలను సూపరింటెండెంట్ రవిప్రభు హెచ్చరించారు. రుయాస్పత్రిలోని లెక్చరర్ గ్యాలరీలో ఆయన మంగళవారం వారితో ప్రత్యేకంగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి అవినీతి, ఇబ్బందులు లేని నాణ్యమైన వైద్యసేవలను రోగులకు అందించేందుకు కృషి చేస్తుందని, పలు నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతుందన్నారు. త్వరలోనే ఐవీఆర్ఎస్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు. ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందిన రోగులకు మరుసటి రోజు ప్రభుత్వం నుంచి ఫోన్ చేసి ఆస్పత్రిలో ఎలాంటి వైద్యం అందించారు, అక్కడ ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా, ఎవరైనా డబ్బులు అడిగారా లేదా మీరేమైనా ఇచ్చారా, వైద్యసేవలు పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా అనే కోణంలో 5 ప్రశ్నలను రోగులను అడుగుతారని, అందులో రోగులు చెప్పే సమాధానాల ఆధారంగా విచారణ చేపట్టి అనంతరం తగు చర్యలు చేపడతామన్నారు. అడ్మినిస్ట్రేటర్ కనకనరసారెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్ పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన ఎస్వీయూలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో మేళా ప్రారంభం కానుంది. అపోలో ఫార్మసీలో 50 ఫార్మాసిస్ట్ ఉద్యోగాల భర్తీకి ఈ మేళా చేపట్టనున్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఏదైనా ఫార్మసీ కోర్సు చదువుకున్న వారు అర్హులు. వేతనం రూ.12 వేల నంచి రూ.20 వేలు ఉంటుంది. 18 నుంచి 30 ఏళ్ల లోపు వయసు కల్గిన వారు అర్హులు. వివరాల కోసం.. 95338 89902 నెంబరులో సంప్రదించాలని నిర్వాహకులు శ్రీనివాసులు తెలిపారు.

తిరుపతి

తిరుపతిలో నలుగురు ఆకతాయిలపై బైండోవర్ కేసుల నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద ఆదివారం అర్ధరాత్రి మద్యం సేవిస్తూ ప్రత్యర్థులను మట్టుపెట్టడానికి పథకం రచించిన కేసులో వెస్ట్ పోలీసులు నలుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. రుయా ఆసుపత్రి వద్ద పాత కక్షల నేపథ్యంలో తమ ప్రత్యర్థులైన వినయ్, శివలను హత్య చేయాలని పథకం రచించిన విషయం విదితమే. దీంతో సీఐ మురళీమోహన్ మంగళవారం వినయ్, శివలతో పాటు మల్లిఖార్జున, నరసింహలను అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశారు. అనంతరం వీరిని తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఎదుట హాజరపరచారు. విచారించిన తహసీల్దార్ వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఓబీసీ డిమాండ్ల సాధనకు ఛలో ఢిల్లీ



ఛలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జబ్బల శ్రీనివాసులు తదితరులు

తిరుపతి(లీలామహల్), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓబీసీల డిమాండ్ల సాధన కోసం మార్చి 12, 13వ తేదీన ఛలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టినట్లు సౌత్ ఇండియా ఓబీసీ అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలోని ఆంధ్రభవన్, అంబేడ్కర్ ఆడిటోరియంలో జరిగే సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, దక్షిణ భారతదేశం నుంచి మేధావులు, బీసీ కులాలకు చెందిన నాయకులు పార్టీలకు అతీతంగా హాజరవుతారన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్‌తోపాటూ రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ బీసీలకు కేటాయింపుపై ఈ సభలో చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం బీసీల అభ్యున్నతికి చేపట్టాల్సిన అంశాలను వినతి రూపంలో ప్రధాని మోదీకి అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఛలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించారు. షణ్ముగం, సుగుణ, రెడ్డెప్ప, గుండ్లూరి శ్రీనివాసులు, రవీంద్ర, మల్లి, రెడ్డిశేఖర్, మహేష్, నాగసుబ్బయ్య, రఘురామ్, సుధాకర్‌పాల్గొన్నారు.

7న స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సురేష్‌బాబు, మహిళా ఉద్యోగులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 7న ఎస్వీ మెడికల్ కళాశాల మైదానంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని, వారికి స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేయాలని ఏపీ జేఏసీ ఛైర్మన్ సురేష్ బాబు, మహిళా ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆటల పోటీల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు. మార్చి 8న ఎస్వీ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, లలిత్‌కుమార్, హేమగిరి, పద్మజ, పలు సంఘాల మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో చెత్త వేస్తే జరిమానా



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మురుగునీటి కాలువల్లో ఎవరైనా చెత్త వేస్తే జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని సప్తగిరి నగర్, యశోదా నగర్, ప్రశాంత్ నగర్, రైల్వే కాలనీ తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం వేయడం వలన ఇరుక్కు పోయి డ్రైన్ నీళ్లు పైకి వస్తున్నాయన్నారు. ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని.. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా తమ సిబ్బందికి తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ గోమతి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

రైల్వేలో స్టేషన్ మాస్టర్ల పాత్ర కీలకం

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రైల్వేలో రోజుకు కోట్ల మంది ప్రయాణికులు క్షేమంగా గమ్యం చేరుకోవడానికి స్టేషన్ మాస్టర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. తిరుపతిలో మంగళవారం జరిగిన ఆలిండియా రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ల అసోసియేషన్ జాతీయ మహాసభలో ఆయన మాట్లాడారు. తన తండ్రి త్యాగరాజ్ స్టేషన్ మాస్టర్‌గా చేసిన శ్రమను తాను బాల్యంలో చూసిన ఘట్టాలను వివరించారు. రిటైరైన తర్వాత తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి వీరంతా ఓ సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన తన తండ్రి త్యాగరాజ్‌ను సన్మానించారు. అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు జి.మురళీధర్, విజయకుమార్ మాట్లాడుతూ 2018 ఫిబ్రవరి 2న స్టేషన్ మాస్టర్లకు ఇచ్చిన ఎంఏసీపీని 2016 జనవరి1 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, డాక్టర్ పంకజ్ శ్రీనివాస్, సేతురామన్, ఎంఎస్ఎన్ ప్రసాద్, పి.సూర్యచంద్రరావు, ఎన్.ముకుందరావు, బి.శ్యామసుందర్‌రావు, ఉదయ చంద్రన్, పి.పి.చౌబే, కె.కె.శర్మ, సవేన, ప్రభాకరయ్య, సాంబిరెడ్డి, చలపతిరావు, స్థానిక విశ్రాంత స్టేషన్ మాస్టర్లు పాల్గొన్నారు. ఈ సమావేశానికి భారత రైల్వేలోని 17 జోన్ల నుంచి 400 మంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కల్పవృక్ష వాహనంపై కపిలేశ్వరుడి దివ్యదర్శనం

● నేడు కపిలతీర్థంలో మహాశివరాత్రి వేడుకలు



కల్పవృక్ష వాహనంపై ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన మంగళవారం ఉదయం స్వామి వారు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ పుర వీధుల్లో వాహన సేవ కోలాహలంగా సాగింది. ఆలయం నుంచి కపిలతీర్థం రోడ్డు, అన్నారావు సర్కిల్, వినాయకనగర్, క్వార్టర్స్, హరేరామ హరేకృష్ణగుడి, ఎన్‌జీవోకాలనీ, అలిపిరి బైపాస్ రోడ్డు మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. అనంతరం అర్చకులు శాస్త్రోక్తంగా స్నపన తిరుమజనం జరిపి సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్ల రసాలు, చందనంతో అభిషేకం జరిపారు. రాత్రి స్వామివారు అశ్వ వాహనంపై కొలువుదీరగా వాహనం ముందు అంబారీలు నడుస్తుండగా భక్త బృందాలు, మంగళవాయిద్యాలతో అంగరంగ వైభవంగా పట్టణ పురవీధుల్లో ఊరేగారు. శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళాశాల విద్యార్థులు చేసిన గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలంకరణలో కపిలేశ్వరస్వామి ఆలయం

● కపిలతీర్థంలో నేడు

మహాశివరాత్రిని పురస్కరించుకుని కపిలతీర్థంలో కపిలేశ్వరస్వామిని అధిక సంఖ్యల భక్తులు దర్శించుకోవడం ఆనవాయితీ. టీటీడీ అధికారులు ఆలయాన్ని పూలమాలలు, విద్యుత్ దీప కాంతులతో సుందరంగా అలంకరించారు. బుధవారం ఆలయంలో ఉదయం 3 గంటల నుంచే సుప్రభాతం, అభిషేక కార్యక్రమాలు, స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయి. ఆలయం వద్ద రథోత్సవం(భోగితేరు), సాయంత్రం 6 నుంచి 10 గంటల వరకు నంది వాహనంపై ఊరేగుతారు.

విద్యుత్ దీపాలంకరణ నడుమ.. జీవలింగేశ్వరుడు

● నేడు ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనం ప్రారంభం



విద్యుత్ దీపాలంకరణలో జీవలింగేశ్వరస్వామి ఆలయం

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుపతి నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ దీపాలంకరణల నడుమ జీవలింగేశ్వరుడు వెలుగొందుతున్నాడు. బుధవారం వేకువజామున రెండు గంటలకు అమ్మవారికి, స్వామివారికి ఏకకాల రుద్రాభిషేకం నిర్వహించి, అనంతరం 6 గంటల నుంచి సర్వదర్శనం, అర్చనలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 4 గంటలకు స్వామివారికి ప్రదోషకాల అభిషేకం, 6 గంటలకు నంది వాహనంపై శివపార్వతుల ఊరేగింపు, రాత్రి 8.30 నుంచి 12 గంటల వరకు భాగవతారిణి గీతావాణిచే శివపార్వతుల కళ్యాణం హరికథ నిర్వహిస్తున్నారు. రాత్రి 12 గంటలకు మహాన్యాస పూర్వక లింగోద్భవ కాల రుద్రాభిషేకం, అనంతరం మహా బిల్వార్చన జరుగుతుందని జీవకోన మహాభారత వ్యవస్థాపక ధర్మకర్త, ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నా రామకృష్ణ తెలిపారు.

టీడీఆర్ బాండ్ల ధ్రువీకరణ వేగవంతం చేయండి

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల ధ్రువీకరణ పనులు వేగవంతం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. టీడీఆర్ బాండ్ల ధ్రువీకరణ, స్థల యజమానుల గుర్తింపు, ఎల్ఆర్ఎస్, బీపీఎస్ ఫైళ్ల పరిష్కారం తదితర అంశాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు, కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ టీడీఆర్ బాండ్లు అందేలా వారి ధ్రువపత్రాలను స్వయంగా వెళ్లి స్థల యజమానిని గుర్తించి పరిశీలన చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రత్యేక లాగిన్ ద్వారా రిజిస్టర్ చేయించాలన్నారు. బాండ్ల ధ్రువీకరణలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఏదైనా పొరపాట్లకు తావిస్తే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీ మహాపాత్ర, ఏసీపీలు బాలాజి, మూర్తి, టీపీబీవోలు మధు, వంశీ, ప్లానింగ్ కార్యదర్శులు, రోడ్డు ఇన్చార్జిలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన



దరఖాస్తులను పరిశీలిస్తున్న అమరయ్య


తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాల దరఖాస్తుల పరిశీలన మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య పర్యవేక్షణలో కొనసాగుతోంది. మంగళవారం ఆయన మాట్లాడుతూ బీసీ, కాపు, క్షత్రియ, రెడ్డి, కమ్మ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు పలువురు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెండు రోజులుగా స్థానిక కచ్చపి ఆడిటోరియంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులచే పరిశీలన చేస్తున్నామని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సెలవు ఉంటుందని, 27వ తేదీ తిరిగి ఈ దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు దారులు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం తమ వెంట తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం విశ్వనాథ రెడ్డి, మెప్మా సూపరింటెండెంట్ గాలి సుధాకర్, సీఎంఎం కృష్ణవేణి, బ్యాంకుల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి పీజీ సెట్ రద్దు కోసం..

● పద్మావతి వర్సిటీ ముందు విద్యార్థి సంఘాల ఆందోళన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశానికి చేపట్టే ఉమ్మడి పీజీ సెట్‌ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై పద్మావతి మహిళా యూనివర్సిటీ ముందు మంగళవారం పలు విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, ఏఐఎస్ఎఫ్ నేత ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ నేత అక్బర్, పీడీఎస్‌ఓ నాయకురాలు ఆశ, బీసీ విద్యార్థి సంఘ నేత తిరుమలేష్, లా విద్యార్థి సంఘ నేత సుందరరాజు తదితరులు మాట్లాడారు. ఉమ్మడి పీజీ సెట్ ద్వారా ఉన్నత విద్యకు పేద విద్యార్థులను దూరం చేసినట్టు అవుతుందన్నారు. ఇప్పటికే ఉమ్మడి పీజీ సెట్ ద్వారా అన్ని యూనివర్సిటీల్లో పీజీ ప్రవేశాల సంఖ్య విపరీతంగా తగ్గిపోయిందన్నారు. ఆయా యూనివర్సిటీలకు పీజీ ప్రవేశాలు నిర్వహించుకునే అవకాశం ఇస్తే పీజీ ప్రవేశాల సంఖ్య పెరుగుతుందన్నారు. లేకపోతే, యూనివర్సిటీల్లోని అనేక డిపార్ట్‌మెంట్లు, చివరికి యూనివర్సిటీలే మూతపడే ప్రమాదం ఉందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఉమ్మడి పీజీసెట్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఉమ్మడి పీజీసెట్ రద్దుచేసే దాకా దశలవారీగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టంచేశారు. నాయకులు అశోక్, చిన్న, శివశంకర్‌నాయక్, మహేంద్రనాయక్, వినోద్, బాలాజీ, నరేంద్ర పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తిచేసుకొన్న అంగన్వాడీ వర్కర్లు

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. మంగళం ట్రెండ్స్ జడ్పీ హైస్కూల్‌లో వారం రోజులుగా అంగన్వాడీ వర్కర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అంగన్వాడీ విద్యార్థులకు బోధించే జ్ఞాన, శారీరక, బుద్ధి వికాస అభివృద్ధి, సృజన్మాతకత, ఫ్రీహ్యాండ్ డ్రాయింగ్, సామాజిక భావోద్వేగం తదితర అంశాలపై వీరికి సమగ్ర శిక్షణ ఇచ్చారు. చివరి రోజున టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారుచేసి ప్రదర్శించారు. ఎంఈవో భాస్కర్‌నాయక్, సీడీపీవో సుధారాణి, హెచ్ఎం కేశవులనాయుడు, రీసోర్స్‌పర్సన్లు ప్రభుకుమార్‌శెట్టి, వినోద్‌కుమార్, సీఆర్పీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● 9 బైక్‌ల స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పరిసరాల్లో మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6.65 లక్షల విలువ చేసే 9 బైకులను స్వాధీనం చేసుకొన్నారు. ఈ వివరాలను సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని బాపూజీ కాలనీ చెందిన ఇట్టా మహేంద్ర, షేక్ ఉజామ, కుదిరి తిప్పకండ్రిగకు చెందిన వంశీ.. ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ ఇళ్ల ముందు, రైల్వేస్టేషన్ సమీపంలో నిలిపివున్న మోటరు సైకిళ్లను చోరీ చేసేవారు. వాటిని తమిళనాడులో విక్రయించేవారు. సోమవారం రాత్రి అనుమానాస్పదంగా తిరుగుతున్న మహేంద్ర, షేక్ ఉజామ, వంశీని పోలీసులు విచారించగా బైకుల చోరీ విషయం బయటపడింది. వారిచ్చిన సమాచారంతో బాపూజీ కాలనీ సమీపంలో పాడుపడిన ఇళ్ల వద్ద దాచి ఉంచిన 9 మోటరు సైకిళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వంశీ 11 కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. చోరీ చేసిన బైక్‌లను తీసుకెళ్లేందుకు తమిళనాడులో ఓ ముఠా ఉందని, త్వరలో వారినీ పట్టుకుంటామని సీఐ చెప్పారు.

తిరుమలలో కన్నప్ప బృందం


శివబాలాజీ, మంచు విష్ణు

తిరుమల శ్రీవారిని మంగళవారం కన్నప్ప సినిమా బృందం దర్శించుకుంది. హీరో మంచు విష్ణు, నటుడు శివ బాలాజీ, ఇతర చిత్ర బృంద సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే ఎంపీ జయరాం రమేష్, ఎమ్మెల్యే గణబాబు, నటి నిహారిక, నవ్య కూడా స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


నిహారిక - నవ్య


హుండీ ఆదాయం 4..14 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం నాటి హుండీ ఆదాయం: రూ.4.14 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,764

తలనీలాలు సమర్పించినవారు: 23,504



క్యూలైన్లలోకి ప్రవేశం ఇలా..

భక్తులు వేర్వేరుగా ఆయా క్యూలైన్లలో ప్రవేశించేలా ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రకారం. ఆలయ 1వ గేటు నుంచి ఉచితక్యూలైన్, 2వ గేటు నుంచి రూ.200క్యూలైన్, మూడో గేటు నుంచి రూ.500 క్యూలైన్, 4వ గేటు నుంచి వీఐపీ ప్రవేశమార్గం కోసం క్యూలైన్లను పకడ్బందీగాసిద్ధం చేశారు. వీఐపీల ప్రవేశ ద్వారం వద్ద ప్రత్యేక లాంజ్‌లను సిద్ధం చేశారు. ఇక, సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆర్డీవో, ఈవో పర్యవేక్షణలో పరిమిత సంఖ్యలో వీఐపీలను దర్శనానికి పంపేలా ఏర్పాటు చేశారు.

ఆలయం లోపలా పక్కాగా..

ఆలయం లోపల ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయి గందరగోళ పరిస్థితులకు తావులేకుండా చర్యలు చేపట్టారు. మహద్వారంనుంచి స్వామివారిసన్నిధి, అక్కడి నుంచి అమ్మవారి గర్భగుడి వరకు క్యూలైన్లను ప్రణాళిక బద్ధంగా ఉంచారు. అమ్మవారి దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వెనుక వైపు నుంచి మెట్ల మార్గం ద్వారాదక్షిణగోపురం వద్దకు భక్తులు వెలుపలకు వచ్చేలా ఏర్పాటు చేశారు. దీంతో ఎక్కడా క్యూలైన్లు కలిసిపోయే అవకాశం లేదు. ఇక, అడ్డదారి దర్శనాలకు తావులేకుండా దక్షిణగోపురం, మహద్వారం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తును కేటాయించారు.







ముక్కంటి మహాశివరాత్రికి సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

శ్రీకాళహస్తీశ్వర క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. సుమారు 1.5 లక్షల మంది భక్తులకు దర్శన సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది తొలిసారిగా భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయనున్నారు. దర్శనానంతరం దక్షిణ గాలిగోపురం నుంచి భక్తులందరూ వెలుపలకు వచ్చేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ మూడు ప్రసాదాల కౌంటర్లను భక్తులకు అందుబాటులో పెట్టారు. భక్తులందరికీ ఉచిత లడ్డూ ప్రసాదం ఇచ్చేలా పెద్దఎత్తున తయారు చేశారు. అలాగే మహిళలకు సౌభాగ్యప్రసాదంగా రవిక, పసుపు, కుంకుమ, గాజులను ఉచిత ప్రసాదం కౌంటర్లలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.గతంలో పది వైద్య శిబిరాలు ఏర్పాటు చేయగా... ఈసారి ఆలయ పరిసరాలతో పాటు పట్టణ వ్యాప్తంగా 25 శిబిరాలను భక్తులకు అందుబాటులో ఉంచారు. క్యూలైన్లలో భక్తులకు పంపిణీ చేయడానికి రెండు లక్షల వాటర్ బాటిళ్లు, 2 లక్షల బిస్కెట్ ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇక రాత్రి నంది సేవలో భక్తుల రద్దీకి అనుగుణంగా మాడవీధుల్లో అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం అర్ధ రాత్రిపైన ఆలయంలో లింగోద్భవం సందర్భంగా సామాన్య భక్తులందరూ దర్శించుకునేలా క్యూలైన్ విధానాన్ని పాటించనున్నారు.



ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు బుధవారం వేకువజామున 4గంటల నుంచి పట్టణంలోకి భారీ వాహనాల రాకపోకలను ఆపేయనున్నారు. దీనికోసం అన్ని ప్రవేశ మార్గాల వద్ద పోలీస్ అవుట్ పోస్టులతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల కోసం కేటాయించారు. పట్టణ అన్ని ప్రవేశ మార్గాలోని శివారు మార్గాల్లో మొత్తం 11 వాహనాల పార్కింగ్ కేంద్రాలను కేటాయించారు. అక్కడి నుంచి భక్తులు ఆలయానికి చేరుకునేలా ఉచిత రవాణా సౌకర్యాన్ని సిద్ధం చేశారు.


సిద్ధమైన ఉచిత దర్శన క్యూలైను


అద్దాల మండపం వద్ద క్యూలైన్లు పరిశీలిస్తున్న ఏఎస్పీ రవి మనోహాచారి


రూ500 క్యూలైన్లు


ఆలయంలో అకట్టుకుంటున్న పూల అలంకరణలు


రూ.200 క్యూలైన్

కల్యాణ వెంకన్న రథోత్సవం

చంద్రగిరి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం రథోత్సవం కన్నులపండువగా జరిగింది. పుష్పాలంకృత రథంపై శ్రీదేవి భూదేవి సమేత ఉత్సవమూర్తులను రథంలో అధిష్ఠింపజేశారు. గోవింద నామస్మరణల మధ్య అర్చకులు, అధికారులు,భక్తులు మాడవీధుల్లో రథాన్ని భక్తిశ్రద్ధలతో ముందుకు లాగారు. సాయంత్రం ఉత్సవర్లకు ఊంజల్ సేవను నిర్వహించారు. రాత్రి పట్టు, పీతాంబురాలు, బంగారు ఆభరణాలతో కల్కి అవతారంగా స్వామిని అలంకరించారు. ఉత్సవవర్లు అశ్వ వాహనంపై అధిష్ఠించి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కాగా కల్యాణ వేంకటేశ్వరస్వామిని సినీనటుడు డాక్టర్ మోహన్‌బాబు దర్శించుకున్నారు. అశ్వవాహన సేవలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఈవోల వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రమేష్‌కుమార్, రాజ్‌కుమార్, కంకణ భట్టర్ నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.




అశ్వవాహన సేవలో మోహన్‌బాబు

చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం చైతన్యపురంలో ఏనుగుల మంద బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వేసవిలో ఏనుగుల మంద నీటి కోసం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లడం సాధారణం. మే, జూన్ నెలల్లో ఇటువంటి సంఘటనలు జరిగేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పుడు ఫిబ్రవరిలోనే ఏనుగుల మంద వచ్చి మామిడి తోపులు, వరి పంటలను ధ్వంసం చేయడం ఇదే మొదటి సారంటున్నారు. ఏనుగుల రాకను గమనించిన గ్రామస్తులు భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు.

వైసీపీకి భారీ షాక్

● పవన్ సమక్షంలో పెద్దఎత్తున జనసేనలో చేరికలు

తిరుపతి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): తిరుపతి వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆపార్టీకి చెందిన పది మంది కార్పొరేటర్లు, ఇద్దరు టౌన్‌బ్యాంకు డైరెక్టర్లు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా కన్వీనర్లతో పాటు మరో 11 మంది జనసేన తీర్థం పుచ్చుకున్నారు. మంగళగిరిలో మంగళవారం జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో వీరంతా జనసేన కండువా కప్పుకొన్నారు. తొలుత వైసీపీ అసమ్మతి కార్పొరేటర్లు మాత్రమే జనసేనలోకి చేరుతారని ప్రచారం జరిగింది. అయితే పెద్దఎత్తున వైసీపీ నేతలు చేరడంతో రాజకీయంగా చర్చగా మారింది. డిప్యూటీ మేయర్ ఎన్నికల నేపథ్యంలో మనస్తాపంతో బయటకు వచ్చిన భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అనుచరుడు 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు పవన్ సమక్షంలో జనసేనలో చేరి షాక్ ఇచ్చారు. అలాగే, వైసీపీ కార్పొరేటర్లు పొన్నాల చంద్ర (28వ డివిజన్), టీశైలజ (32వ), దూది కుమారి (33వ), కుడితి సుబ్రమణ్యం (36వ), రాధ యాదవ్ (43వ), ఆదం లీలావతితో పాటు ఇదివరకు చేరిన సీకే రేవతి (31వ), కల్పన యాదవ్ (30వ), వట్టికుంట నారాయణ (44వ డివిజన్) కూడా పవన్ సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. తిరుపతి టౌన్ బ్యాంకు డైరెక్టర్లు అనిల్ రాయల్, వెంకటేష్, వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్, వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ కొటారి సుభాష్‌తో పాటు అధికార ప్రతినిధి తిరుత్తణి వేణుగోపాల్, నాయకులు దూది శివ, ఎస్కేఫిరోజ్, పి.సుధీర్, నయనార్ శ్రీనివాసులు, సునీల్ చక్రవర్తి, యశ్వంత్, కార్తీక్, నరేష్ రెడ్డి, సీకే రవి, యాదవ కృష్ణ జనసేన పార్టీలో చేరారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు ఆరణి మదన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఉన్నారు.




జేఎస్పీలో చేరిన వైసీపీ యువత అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ - వైసీపీ సీనియర్ నేత, కార్పొరేటర్ ఎస్కే బాబు - టౌన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్ రాయల్

ఏనుగుల దాడిలో గాయపడిన బాలికకు రుయాలో చికిత్స

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిలా ఓబులవారిపల్లె మండలం గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని శేషాచల అడవిలో ఏనుగుల గుంపు దాడి చేసిన ఘటనలో గాయపడిన బాలికకు తిరుపతిలోని రుయాస్పత్రిలో చికిత్స అందించారు. రైల్వే కోడూరు మండలం ఉర్లగట్టుపోడు అరుంధతివాడ, కన్నెగుంట గిరిజన కాలనీలకు చెందిన 30 మంది తలకోనకు వచ్చేందుకు కాలినడకన సోమవారం రాత్రి 7 గంటల సమయంలో శేషాచలం అటవీమార్గంలో వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ దాడిలో ముగ్గురు మృతిచెందగా, నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో మహాలక్ష్మి(16)ని రుయాస్పత్రి తీసుకురాగా, వైద్యులు పరీక్షించారు. ఆమె కాలిభాగం తీవ్రంగా దెబ్బతిని ఉండటంతో చికిత్స అందించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక ఘటనలపై దర్యాప్తు చేయించండి

● హైకోర్టులో మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి పిల్

అమరావతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక సందర్భంగా జరిగిన ఘటనలపై సీబీఐ లేదా హైకోర్టు పర్యవేక్షణలో ఓ కమిటీ లేదా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో దర్యాప్తు చేయించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రమణ్యస్వామి మంగళవారం హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈనెల 3, 4 తేదీల్లో పోలీసులు, ఎన్నికల అధికారుల పాత్రపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేయాలని కోరారు. హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీ, ఏపీ ఎన్నికల సంఘం, కేంద్ర ఎన్నికల సంఘం, సీబీఐ, కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేర్చారు.

పుత్తూరు వార్తలు

నేటి శివరాత్రి ఉత్సవాల వివరాలు

పుత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

పల్లికొండేశ్వరాలయం, సురుటుపల్లి, నాగలాపురం

శివరాత్రి కార్యక్రమాలు: బుధవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయ ఆవరణలో వివిధ పుష్పాలంకరణలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలంకరణలతో ముస్తాబు చేశారు. ప్రత్యేక పోలీసు బృందం, వలంటీర్లను ఏర్పాటు చేశారు.

పూజా కార్యక్రమాలు

ఉదయం 5 గంటలకు యాగశాల పూజ, 10 గంటలకు స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్ర 6 నుంచి 7 గంటల వరకు స్వామిఅమ్మవార్లకు వాహన సమర్పణ, 7గంటలకు సర్వమంగళా దేవి సమేత వాల్మీకేశ్వర స్వామి వృషభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

ఆలయం: సదాశివకోన, వడమాలపేట మండలం

శివరాత్రి కార్యక్రమాలు: బుధవారం వేకువజామున లింగోద్భవ అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం నిరంతరాయంగా సర్వదర్శనం ఉంటుంది. ఇప్పటికే ప్రకృతి ఒడిలో అలరారుతున్న సదాశివకోన శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన సమాజం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు.

ఆలయం: కైలాసనాథ స్వామి ఆలయం, కైలాసకోన, నారాయణవనం



శివరాత్రి కార్యక్రమాలు: మహాశివరాత్రి సందర్భంగా వేకువజాము 4 గంటలకు మొదటి గంట శుద్ధి, సుప్రభాత సేవ. 5 గంటలు రుద్రాభిషేకం, లలితాసహస్రనామ కుంకుమార్చన, హారతి . 6 గంటలకు స్వామివారి సర్వదర్శనం. రాత్రి 10 గంటలకు మహన్యాస పూర్వక లింగోద్భవం, రుద్రాభిషేకం, బిల్వార్చన.

ఆలయం: మూలకోన, పుత్తూరు మండలం

శివరాత్రి కార్యక్రమాలు: మూలకోనలో మహాశివరాత్రి సందర్భంగా శివ పార్వతులకు పత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు ఆదిదంపతులకు మహాభిషేకం, ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు గణపతి, నవగ్రహ హోమాలు. 9 గంటలకు శివపార్వతుల కల్యాణం. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం. మధ్యాహ్నం 3 గంటలకు పండరి భజన, కోలాటం. లింగోద్భవ సమయంలో మహా రుద్రాభిషేకం జరుగుతుంది.

- పుత్తూరు పట్టణంలో కొలువై ఉన్న కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, సదాశివేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఆప్కాస్ రద్దు వద్దు

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి25(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేసి ఆ స్థానంలో దళారి, కాంట్రాక్ట్ వ్యవస్థలను తీసుకురావద్దని సీఐటీయూ తిరుపతి జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆప్కాస్ రద్దును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం ముందుగా కమిషనర్లకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రం ఇస్తామన్నారు. దశల వారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 28వ తేదీన ఆర్డీవోకు, మార్చి 1న కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, మునెయ్య, మణికంఠం, ఢిల్లీ, అంకయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు.

టైలరింగ్ ఉచిత శిక్షణ ప్రారంభం

పుత్తూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి సంస్థ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళల టైలరింగ్ ఉచిత శిక్షణను ప్రిన్సిపాల్ చంద్రమౌళి ప్రారంభించారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు జరగనుంది. అధ్యాపకులు కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ముగిసిన జ్ఞానజ్యోతి శిక్షణ

పుత్తూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తల ఆరు రోజుల జ్ఞానజ్యోతి శిక్షణ శిబిరం మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ముగిసింది. ఈ సందర్భంగా పుత్తూరు డీవైఈవో ప్రభాకర్ రాజు మాట్లాడుతూ... శిక్షణలో నేర్పిన శారీరక అభివృద్ధి, భాషాభివృద్ధి, మేధాభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, సృజనాత్మకత అంశాలు పిల్లల ప్రతిభను వెలికి తీయడానికి వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, భువనేశ్వరి, అనిత, రమేష్, వెంకటేశ్, గీతాంజలి, సంధ్య, అనిత పాల్గొన్నారు.

ఆర్వోబీ కోసం అటవీ భూమి కేటాయింపు

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 1.27 ఎకరాల అటవీ భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏర్పేడుకు సమీపాన ఎన్‌హెచ్-567పై ఫోర్ లేన్ రోడ్డు నిర్మాణంలో వున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా 510-8 కిలోమీటరు వద్ద ఆర్వోబీ నిర్మించేందుకు 1.27 ఎకరాల అటవీ భూమి అవసరమన్న జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. దీనిపై అటవీ శాఖ తిరుపతి రేంజి, కృష్ణాపురం సెక్షన్, ఏర్పేడు బీట్, కంపార్ట్‌మెంట్ నంబరు 192 పరిధిలోని రిజర్వు ఫారెస్టులో 1.27 ఎకరాల భూమిని ఆర్వోబీ కోసం కేటాయించేందుకు అంగీకరించింది. ఆ మేరకు భూమిని తిరుపతి ఆర్‌అండ్‌బీ ఎన్‌హెచ్ ఈఈ పేరిట బదలాయిస్తూ రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అటవీ భూమిలో ఆర్వోబీ మినహా ఇతర నిర్మాణం చేపట్టరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

సాగరమాల పరిహారం లబ్ధిదారుల ఎంపిక

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లె సచివాలయంలో మంగళవారం సాగరమాల రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన రైతలకు పరిహారమిచ్చేందుకు గ్రామసభ నిర్వహించారు. నెల్లూరుపల్లె, కొత్తపాళెం, అగ్రహారం గ్రామాల్లోని 15మంది రైతులకు చెందిన భూములు రోడ్డు విస్తరణలో పోయాయి. అయితే అడంగల్‌లో రైతుల పేర్లు లేకపోవడంతో పరిహారం నిలిపివేశారు. మంగళవారం తహసీల్దార్ జయజయరావు గ్రామసభ నిర్వహించి 15మంది రైతలను పరిహారం కోసం అర్హులుగా ఎంపిక చేసి నివేదికను గూడూరు సబ్‌కలెక్టర్‌కు పంపించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఐదుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కేశవరం, చిట్టేడు, గూడలి, కోట 1, కోట 3, పంచాయతీల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో గోపి మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సర్వేలను సకాలంలో చేయడంలో నిర్లక్ష్యం వహించారని, జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావడం లేదన్న కారణాలతో షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘ నాయకులు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వరికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వివి. రమణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం క్వింటాలు ధరలు రూ.1650కి పడిపోయిందని, ఆరుగాలం పండించిన రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మద్దతు ధర రూ.2500 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి సునీత మాట్లాడుతూ ధాన్యం ఎగుమతులకు అనుమతించాలని, లేదంటే మద్దతు ధరపై బస్తాకి రూ.500 బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతాన్ని 22గా నిర్ణయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, తిరుపాలు, భాస్కర్, పారి పెంచలయ్య, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఝాన్సీ, ఓబయ్య, రైతులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు




పందెంలో పరుగులు తీస్తున్న ఎద్దులు - మొదటి బహుమతి అందుకుంటున్న భాస్కరరెడ్డి

కోట, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం సూరిశెట్టిపాళెంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఒంగోలు జాతి ఎద్దుల పోటీలు జరిగాయి. ఆలయ ధర్మకర్త రామయ్యశెట్టి ఆధ్వర్యంలో ఈ పోటీల్లో కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, గూడూరు మండలాలకు రైతులకు చెందిన ఒంగోలు జాతి ఎద్దులు పాల్గొన్నాయి. కోట మండలం వంజివాకకు చెందిన మల్లు భాస్కర్‌రెడ్డికి చెందిన ఎద్దులు మొదటి బహుమతి రూ.30 వేలు గెలుచుకున్నాయి. అదేవిధంగా సూరిశెట్టిపాళెం గ్రామానికి చెందిన భాస్కర్‌కు చెందిన ఎద్దులు రెండవ బహుమతిగా రూ.20 వేలు, వాకాడు మండలం కల్లూరు కొత్తపాళెం గ్రామస్తుడు కోటయ్యకు చెందిన ఎద్దులు మూడవ బహుమతి రూ.10 వేలును, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన రమ ణయ్య ఎద్దులు నాల్గవ బహుమతి రూ.5వేలు, వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఏడుకొండలు ఎద్దులు ఐదో బహు మతి రూ.మూడువేలు గెలుచుకున్నాయి.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మహిళలతో సంస్థ ప్రతినిధులు

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు వృత్తి విద్యాకోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని సునీత సేవాసంస్థ ప్రధాన కార్యదర్శి సారంగం సులక్ష్మి తెలిపారు. మంగళవారం సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్ ఉచిత శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించుకునేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమాదేవి, రూపా, గిరిజ తదితరులు పాల్గొన్నారు.




ముక్కంటి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో పాల్గొనే భక్తుల కోసం సిద్ధం చేసిన వాటర్ బాటిళ్లు - మహిళల కోసం మొబైల్ మరుగుదొడ్లు




వీఐపీల కోసం ఏర్పాటు చేసిన లాంజ్ - త్రినేత్ర అతిథి గృహం వద్ద మెడికల్ క్యాంప్

తేజోమయం దక్షిణ కైలాసం




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): వాయులింగేశ్వరుడు కొలువైన దక్షిణ కైలాస క్షేత్రం శ్రీకాళహస్తి తేజోమయంగా ప్రకాశిస్తోంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం లోపల పుష్పాలంకరణ అబ్బురపరుస్తోంది. గోపురాలు, ప్రధాన కూడళ్లు, స్వర్ణముఖి నది ప్రాంతం కాంతివంతంగా మారాయి. ఎల్ఈడీ లైట్లతో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు





శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని ధూర్జటి కళాప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పట్టణానికి చెందిన సుభాష్ భక్తికీర్తనలతో మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తికి చెందిన హరిత కూచిపూడి, చెందిన అలేఖ్య, వాణిచంద్ర, మహాలక్ష్మి, నేహసాయి, చిలకలూరిపేటకు చెందిన శ్రావణి, తిరుపతికి చెందిన రుషిక వేర్వేరుగా చేసిన భరతనాట్యం అలరించింది. నెల్లూరుకు చెందిన లావణ్య భక్తికీర్తనలు, శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన రేణుకమ్మ భక్తిరంజని, నెల్లూరుకు చెందిన లక్ష్మీ న్యాటమండలి ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర, వెంకటగిరికి చెందిన నటరాజ నాట్యమండలి ప్రదర్శించిన వీరబ్రహ్మం నాటకం ఆకట్టుకున్నాయి.



శివాలయాల్లో నేటి కార్యక్రమాలు

గూడూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం ఆలయాల్లో స్వామివారికి పూజలు నిర్వహించేందుకు, భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు.



మూలస్థానేశ్వరస్వామి ఆలయం

గూడూరు: పట్టణంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి (పెద్ద శివాలయం)లో బుధవారం ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, స్వామివారికి రుద్రాభిషేకం, కల్యాణోత్సవం, లింగోద్భవకాల రుద్రాభిషేకం, స్వామి, అమ్మవార్ల మాఢ ఉత్సవం నిర్వహించనున్నారు.

కోట: గూడలి గ్రామంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు, స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. గూడలితిప్పపై వెలసిన పర్వతవర్థినీ సమేత భీమేశ్వరాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణో త్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.



గూడలిలోని భీమేశ్వరాలయం

చిల్లకూరు: చేడిమాల గ్రామంలోని కామాక్షీదేవి సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రికి స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపిస్తారు.



చేడిమాలలోని నాగలింగేశ్వరాలయం



స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి దేవాలయం

డక్కిలి: దేవుని వెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, రాత్రికి పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

వెంకటగిరి: పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలు జరపనున్నారు.

వాకాడు: మండలం పంట్రంగం గ్రామంలోని కామాక్షీ సమేత పాండురంగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఉదయం స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం నిర్వహిస్తారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి స్వామివారికి పాలతో అభిషేకం జరపనున్నారు. రాత్రికి స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహిస్తారు.



పంట్రంగంలోని పాండురంగేశ్వరాలయం

నాయుడుపేట: పాత బ్రాహ్మణ వీధిలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర ఆలయంలో కలశ ప్రతిష్ఠ, గణపతిపూజ, స్వామివారికి క్షీరాభిషేకాలు, నివేదన జరుగుతాయి. రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం నిర్వహిస్తారు. తుమ్మూరులోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహా గణపతికి అభిషేకం, స్వామివారికి నంది, హంస వాహన సేవలు, రాత్రి లింగోద్భవ కాలంలో రుద్రాభిషేకం నిర్వహించ నున్నారు. స్వర్ణముఖి నది తీరంలోని ప్రసూనాంబ నీలకంఠేశ్వర ఆలయంలో రుద్రహోమం, లలిత హోమం, మహాపూర్ణాహుతి, నందివాహన సేవ రాత్రి రుద్రాభిషేకం చేస్తారు.



నాయుడుపేట కాశీవిశ్వేశ్వర ఆలయం

సూళ్లూరుపేట: పట్టణంలోని గంగా పార్వతీ సమేత త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వర స్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి క్షీరాభిషేకం, రాత్రి రుద్రాభిషేకం చేస్తారు. మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి కాళంగి నదిలో నీటిని తెచ్చి అభిషేకం చేస్తారు. అదేవిధంగా కుదిరిలో మల్లికార్జునేశ్వర స్వామి ఆలయం, కొరిడి వనలీలా కంఠేశ్వర ఆలయంలో అభిషేకాలు చేస్తారు.



మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి ఆలయం

తడ: చిన్నమాంబట్టులోని కాశీవిశ్వేశ్వరస్వామి అన్నపూర్ణాదేవి ఆలయం, బోడిలింగాలపాడులో ఉన్న భువనేశ్వరి స్వామి ఆలయం, వాటంబేడు వద్దనున్న విశాలాక్షీ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించ నున్నారు.



మాంబట్టు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం

ఓజిలి: భట్లకనుపూరులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో ఉదయం గణపతి పూజ, హోమం నిర్వహిస్తారు.

చిట్టమూరు: యాకసిరి తిప్పపై వెలసిన భూపతేశ్వరస్వామి ఆలయం, యాకసిరి పాటిమిట్ట నాగే శ్వరస్వామి, గునపాడు వల్మీకి నాగేశ్వరస్వామి, మల్లాంలోని మార్కేండేయ స్వామి ఆలయాల్లో ఉదయం శివలింగాలకు అభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం భూపతేశ్వరస్వామి గ్రామోత్సవం, కల్యాణోత్సవం, రాత్రి 11 గంటలకు పుష్పాభిషేకం నిర్వహిస్తారు.



యాకసిరితిప్ప భూపతేశ్వరస్వామి ఆలయం

నీలకంఠేశ్వరాలయంలో శివరాత్రి మహోత్సవాలు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గణపతి హోమం, పూర్ణాహుతి, ప్రదోషకాల పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్న ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గూడూరు ప్రభావతి, సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

నేడు నంది వాహన సేవ

సింహవాహనంపై విహరించనున్న అమ్మవారు




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి నందిసేవ నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి బంగారు నందిపైన... జ్ఞానప్రసూనాంబ దేవి బంగారు సింహవాహనంపై అధిష్ఠించి పురవిహారం చేయనున్నారు. తిరుమలలో గరుడోత్సవానికి ఎంత ప్రాధాన్యం ఉందో... శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివ రాత్రి సందర్భంగా నిర్వహించే నందిసేవకు అంతే ప్రత్యేకత. నంది, సింహ వాహనాలపై ఊరేగుతున్న శివపార్వతులను దర్శించుకోవడానికి భక్తులు వేలసంఖ్యలో తరలిరానున్నారు. నంది సేవ సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇక ఉదయం స్వామివారు ఇంద్ర విమానం, జ్ఞానప్రసూనాంబదేవి చప్పరంపైన భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నారు.

బిస్కెట్లు, వాటర్ బాటిళ్ల వితరణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణానికి చెందిన శ్రీకాళహస్తి కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సుమారు రూ.లక్ష విలువైన బిస్కెట్లను, వాటర్‌బాటిళ్లను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి అందజేశారు. అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ దేవుడి ఉత్సవానికి సేవ చేయడం మహద్భాగ్యంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, అసోసియేషన్ సభ్యులు రాము గుప్త, బద్రి నారాయణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం



రిషితారెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న మునిరాజాయాదవ్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం కందాడ గ్రామంలో కొలువై ఉన్న కామాక్షి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డికి ఆలయ నిర్వాహకులు ఆహ్వానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా మాజీ కార్యనిర్వహక కార్యదర్శి బొడుగు మునిరాజా యాదవ్, టీడీపీ మండల కార్యనిర్వాహక కార్యదర్శి కేశినేని సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు తేజ, మనోజ్, సత్యం, రాజగోపాల్ తదితరులున్నారు.

గుడిమల్లంలో బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన



బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరుడి ఆలయంలో శివరాత్రి సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. ఆలయానికి వచ్చే వాహనాలకు ప్రత్యేకంగా ఐదు ఎకరాల స్థలంలో పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని ఎస్పీ పరిశీలించారు. గుడిమల్లం ఆలయానికి వచ్చే భక్తులు రాజుల కండ్రిగ, చెల్లూరు కాస్ మీదుగా తిరిగి వెళ్లే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, ఏర్పేడు, రేణిగుంట, గాజులమండ్యం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం



బీఎన్‌కండ్రిగలో జరిగిన అవగాహన ర్యాలీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరమని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ మంగళవారం బాల్యవివాహాల నిర్మూలనపై పట్టణంలో అవగాహన ర్యాలీ చేశారు. పట్టణంలోని రాజగోపురం వద్ద నుంచి డీఎస్పీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అంతకు ముందు డీఎస్పీ మాట్లాడుతూ... వయస్సు నిండకుండా వివాహం చేయడంతో తీవ్ర అనర్థాలు వస్తాయన్నారు. జిల్లా కమిషనర్లు ఎం.ఎం.రెడ్డి, రమేష్‌బాబు, యూత్ చైర్మన్ షేక్ అజారుద్దీన్, గైడ్ కెప్టెన్ పద్మావతి, స్కౌట్ మాస్టర్లు రోవర్ లీడర్, బాలురు, బాలికల ఉన్నత పాఠశాల, బాబుగ్రహారం, సరస్వతిబాయి, భాస్కర పేట పురపాలక ఉన్నత పాఠశాలల, ఏపీ గిరిజన సంక్షేమ పాఠశాల, అర్సీపీ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోవర్లు, రేంజర్లు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బాల్య వివాహాల వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ చందమాల కోటయ్య కోరారు. బుచ్చినాయుడుకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోటయ్య మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహాలు చేయాలన్నారు. ప్రజా ప్రగతి ట్రస్టు మండల కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, పాఠశాల హెచ్ఎం రమణయ్య పాల్గొన్నారు.

ప్రతి పల్లె శుభ్రంగా ఉండాలి

జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి



రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి పల్లె శుభ్రంగా ఉండాలని పారిశుధ్య సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి ఆదేశించారు. కరకంబాడి పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో జిల్లాలోని డీఎస్పీవో, ఈవోపీఆర్డీలకు తడి, పొడి చెత్త ద్వారా సంపద సృష్టిపై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మార్చి 31వ తేదీలోగా జిల్లాలో ప్రతి పల్లెను శుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలో 610 ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలుండగా వీటిని అన్నిటిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఇప్పటికే జిల్లాలో సంపద సృష్టి ద్వారా రూ.7.20లక్షల ఆదాయం వచ్చిందన్నారు. సర్పంచ్ ఈశ్వరమ్మ, జిల్లా కోఆర్డినేటర్, డీటీఆర్పీ శిరీష, డీఎల్పీవో ప్రభురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎంజీ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు మండలాల్లో ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటన

పిచ్చాటూరు, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని మూడు మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటించడమే కాకుండా ఆలయాల్లో జరిగే శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొంటారు. ఉదయం 8 గంటలకు నారాయణవనం మండలంలోని కైలాసనాథ కోనకు చేరుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు పిచ్చాటూరు మండలంలోని రామగిరి వాలీశ్వరాలయానికి చేరుకుని అభిషేక పూజల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి సాయంత్రం 6 గంటలకు నాగలాపురం మండలంలోని సురుటుపల్లికి చేరుకుని పల్లికొండేశ్వరస్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ఉభయదారుగా వ్యవహరిస్తారు.

పల్లికొండేశ్వరాలయంలో శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

సామాన్య భక్తులకే తొలి ప్రాధాన్యం ● అంతరాలయ దర్శనం రద్దు





క్యూలైన్లను పరిశీలిస్తున్న సీఈవో, ఆలయ ఈవో - పుష్పాలంకరణకు సిద్ధమవుతున్న మాలలు - విద్యుత్ దీపాలంకరణ

నాగలాపురం, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈవో లత, చీఫ్ ఈవో జయకుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. ప్రత్యేక పుష్పాలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, భక్తులకు ప్రత్యేక క్యూలైను, తాగునీటి వసతి, ప్రత్యేక వైద్య శిబిరం, శ్రీసిటి నుంచి 40 మంది సెక్యూరిటీ సిబ్బంది, 40 మంది వలంటీర్లను నియమించారు. ట్రాఫిక్ నియంత్రణకు సత్యవేడు సీఐ మురళి, నాగలాపురం ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో 30 మందితో బందోబస్తు, 30 సీసీ కెమెరాల నిఘాతో ఏర్పాటు చేశారు. 10 మంది ప్రత్యేక అర్చకులతో అన్ని సన్నిధానాల్లో భక్తులకు దర్శన ఏర్పాట్లు, ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఉచిత ప్రసాదాలు, నిత్యాన్నదానం చేయనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం వృషభ వాహన సేవ నిర్వహించ నున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో లత మాట్లాడుతూ.. మహాశివరాత్రి ఉత్సవాల్లో అంతరాలయ దర్శనం రద్దుచేశాం. స్వామివారి దర్శనం కోసం వచ్చే సాధారణ భక్తులకే తొలి ప్రాధాన్యం. తోపులాటలు జరుగకుండా ప్రశాంతగా స్వామివారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాం' అని పేర్కొన్నారు.

అశ్వవాహనంపై వాల్మీకేశ్వరుడి విహారం




అశ్వవాహనంపై స్వామి, పల్లకిపై అమ్మవార్లు - మండపంలో భరతనాట్యం చేస్తున్న చిన్నారులు

నాగలాపురం, ఫిబ్రవరి 25, (ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వాల్మీకేశ్వరుడు అశ్వవాహనాన్ని అధిరోహించి భక్తులను కటాక్షించారు. పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకృతుడైన స్వామివారు క్షత్రియుడి రూపంలో దర్శనమిచ్చారు. భక్తజనుల కోలాహలం, కేరళ వాయిద్యాల హోరు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలు, బాణ సంచా పేలుళ్ల నడుమ అమ్మవార్లు పల్లకిపై, స్వామివారు అశ్వవాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. స్వామిఅమ్మవార్లకు స్థానిక భక్తులు ఇంటింటా ఆపి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేత్రపర్వంగా అభిషేక సేవ

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయంలోని మూలస్థాన దేవతలైన వాల్మీకేశ్వరస్వామి, మరగదాంబిక అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ యాగశాల మండపంలో యాగశాల పూజలను శాస్త్రోక్తకంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో భరతనాట్య కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల వాహన సేవతో పూజా కార్యక్రమాలను పరిసమాప్తి చేశారు. ఈ పూజలకు తమిళనాడు ఊత్తుకోటకి చెందిన ఎంఆర్.తమిళరశి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు.

శివరాత్రికి శైవాలయాల ముస్తాబు



విద్యుద్దీపాలంకరణలో వరదయ్యపాళెం శివాలయం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని వరదయ్యపాళెం మండలంలోని పలు శివాలయాలు ముస్తాబైయ్యాయి. వరదయ్యపాళెం, సంతవేలూరు, కళత్తూరు పంచాయతీ వడ్డిపాళెంలోని శివాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో సిద్ధం చేశారు. భక్తులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు పలు ఏర్పాట్లు చేశారు.

పరశురామేశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డితో కలిసి పరమేశ్వరుడికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే దంపతులకు ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు స్వాగతం పలికారు. ధనంజయనాయుడు, రాజశేఖర్ నాయుడు, కృష్ణప్ప మొదలియార్, బాబు నాయుడు, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన రోడ్డు ప్రారంభం



రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్ర జ్యోతి): మండలంలోని జీపాళెం నుంచి గుడిమల్లం పరశురామేశ్వరాలయానికి నూతన రోడ్డును ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. శివరాత్రిని పురస్కరించుకుని గుడిమల్లం ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఈ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణానికి కొంత సొంత స్థలాన్ని ఇచ్చిన స్వార్‌కృష్ణను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో గుడిమల్లం ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, టీడీపీ నాయకులు ధనంజయులు నాయుడు, రాజశేఖరనాయుడు, అర్జున్‌బాబు, కృష్ణప్ప మొదలియార్, బాబు నాయుడు, మునిరెడ్డి, చలపతి, హేమాక్షి, వీఆర్వో నళిని తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసనాయక్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక సంఘ పాఠశాలలో మంగళవారం శ్రీకాళహస్తి న్యాయస్థాన 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసనాయక్ చట్టాలపై అవగాహన కల్పించారు. పోక్సో యాక్ట్, బాల్య వివాహాలకు సంబంధించి వివరించారు. సమస్య ఉంటే శ్రీకాళహస్తిలో న్యాయ సేవా అధికార సంస్థకు ఉందని అర్జీ అందిస్తే ఉచితంగా సేవ అందిస్తారన్నారు. అదే విధంగా 15100 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకోవచ్చని వివరించారు. ఎంఈవో భువనేశ్వరి, న్యాయవాదులు రాజేశ్వరరావు, అరుణ్, మల్లికార్జునయ్య, ప్రజ్ఞ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల మార్కెటింగ్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యఅతిథి దశరథరామరెడ్డి

రేణిగుంట, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఔషధ మొక్కల పెంపకం, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఉద్యాన అధికారి దశరథరామరెడ్డి, కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. 40 శాతం రాయితీతో ప్రాసెసింగ్ యూనిట్లు అందిస్తామన్నారు.రైతు ఉత్పత్తిదారులు సంఘాల ద్వారా అయితే మరిన్ని రాయితీలుంటాయని తెలిపారు. కేవీకేలో జాతీయ ఔషధ మొక్కల బోర్డు సహకారంతో నాణ్యమైన మొక్కలు అందిస్తామని కేంద్ర హెడ్ శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాస్ శాస్త్రవేత్త జ్ఞానేశ్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు



నాగలాపురం, ఫిబ్రవరి 26, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ నక్షత్ర, కుంభ, మహా హారతులు ఇచ్చారు. అనంతరం వాల్మీకేశ్వర, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

ముక్కంటికి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ సారె



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం విజయవాడ దుర్గమల్లీశ్వరస్వామి ఆలయం తరఫున సారె సమర్పించారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వాగతం పలికారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి సారెను అందజేశారు. వేదపండితులు దుర్గమల్లీశ్వరస్వామి ఆలయ అధికారులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు...

- ఉదయం 2 గంటలకు : మంగళ వాయిద్యాలు
- ఉదయం 2.30: గోపూజ
- ఉదయం 3.00: సర్వదర్శనం
- ఉదయం 5.30 - 10.30: ఆరు కాలముల అభిషేకాలు
- ఉదయం 10.30: స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- సాయంత్రం 4.00 - 6.00 గంటల వరకు: మూడు కాలముల అభిషేకాలు
- రాత్రి 9.30గంటలకు స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం, నందిసేవ
- రాత్రి 10గంటలకు: దర్శనం ముగింపు